# ప్రతాపరుద్రమహారాజు.

మ.రా.శ్రీ, మాడపాటి హనుమంతరావుగారిచే వ్రాయఁబడినది.

మ॥ "సతతంబ్రశురుఘురిన్విలోచనముల * జ్ఞాటింపక, న్మామనో
ధృతిదూలన్ హృదయప్రదేశముల భే * దింపంగ నుంకింప, కీ
గతికిన్నారణమేమొ, పాయుటకుమా * ర్గంబేదొ యీదుస్థితిన్,
పతితోన్నత్యమ ! మాకునీవిషయఁపు * న్వాతంబునేర్పఁగదే"!

దేశచరిత్రలందు మనకగపడు మహాపురుషులలోఁ గొందరతిహీనస్థితినుండి, స్వీయసామర్థ్య బలమున నత్యున్నతదశ నధిరోహించి, యామరణమునట్టి యుచ్చదశవలని సుఖముల ననుభవించియుండ, మఱికొందరు, శేముషీ విశేషమున నేమి శౌర్యసాహసములందేమి పైవారికేమాత్రముఁ దీసిపోవువారు కాకపోయినను, జీవితసంగరమున నెంతయో నిపుణతతోఁ బోరాడి బహుకాలము విజయలక్ష్మి దృగంచలముల నాకర్షించియుండినను తుదకుఁ దమకాలముననే తమవైభవము క్షీణమార్గము ననుగమించుటఁ గన్నులారగాంచు దుర్దశకుఁ బాల్పడియుందురు. బాబరుచక్రవర్తివలన హిందూదేశాలవాలమున నాటబడిన మొగలుసామ్రాజ్యలత తరువాతిరాజులకాలమున నలుదెసలకెగఁబ్రాకి, చివరకు ఔరంగజేబుకాలమందు నిరుపమాన విస్తృతిని వహించి యంతకుఁ బూర్వమెన్నడును నెఱుంగనంత దట్టముగఁబూచి తనసౌరభముల దిగంతముల కనిపియుండుట మనకువిదితము. అయిన నంతటిసామ్రాజ్య విస్తారము ననుభవించిన యాఔరంగజేబే యంత్యకాలమునఁ దన యధికారవైశాల్యమును గోల్పోయి యపారదుఃఖమునకుఁ గుఱియగుటసంభవించెను. ఇట్టి స్థితులందు వారివైభవక్షీణతకుఁ గారణములేవో కొన్ని తోచుచుండినను, తార్కికదృష్టితోఁ గాక సామాన్యదృష్టితో నవలోకించువారలకీమార్పు లనివార్యములగు దైవికకారణముల ఫలితములుగఁ దోపకమానవు. మనకథానాయకుఁడగు ప్రతాపరుద్రుఁడు నైతమిట్టిచారిత్రిక పురుషుల తరగతికి సంబంధించినవాఁడే.

వీరరుద్రదేవుఁడు, రెండవ ప్రతాపరుద్రుఁడనునామాంతరములుగల ఈమహాపురుషుని జన్మస్థానమైయొప్పుభాగ్యము కాకతీయ రాజపుంగవుల రాజధానియుఁ ద్రిలింగసామ్రాజ్య రమకావాసమును నగు 'ఓరుగల్లు' పురమునకు లభించినది. పదునాఱుసంవత్సరముల వయస్సునఁ గిరీటాధిపతి యయ్యెనను ప్రతాపచరిత్రలోని వాక్యమునుఁబట్టి, ఈయన క్రీ॥శ॥ 1280 లోఁ జన్మించినట్లూహింపఁబడుచున్నది. దేశచరిత్రలును, తదితరగ్రంథములును నీయన తండ్రినామమునుగూర్చి మూకీభావము వహించియున్నను నీతఁడు ఆంధ్రదేశమందెల్లెడలఁ దనశుభ్రయశశ్చంద్రికల వెదజల్లి ఎడతెగని విజయములచేతను విమలవర్తనముచేతను, నెన్నికఁగాంచిన గణపతిరాజునకును, రాజ్యతంత్ర వైశారద్యమువలననుఁ బ్రజానురాగ మహిమవలనను, నద్వితీయగఁ బొగడొంది దుర్గయొక్కయవతారముగఁ జనులచే మ్రొక్కులందిన రుద్రమదేవికి దౌహిత్రుఁడు; ఉమ్మక్కగర్భశుక్తి ముక్తాఫలము. ఈతని బాల్యకాలవృత్తాంతములఁ దెలియుటకుఁ దగుసాధనములంతగాలేకపోయినను వీరయుగమనఁ దగు నక్కాలమున శౌర్యధనులగు రాజన్యుల పుట్టుకచేఁ బవిత్రమైన తనవంశగౌరవమును, యోగ్యమగువిధమునఁ గాపాడుకొనుటకునుఁ బూర్వికుల యశస్సును మఱింత వృద్ధిచేయుటకును వలయు విద్యాసంపద నతఁడు పదునేనువత్సరముల ప్రాయమునాఁడే గడించెనని చెప్పెదరు. స్వకీయమగు మేధావిశేషమునకును దోస్సారమునకును మాతామహియగు రుద్రమదేవియొక్కసచ్ఛిక్షతోడ్పడసర్వవిధముల నాఱితేఱి మన ప్రతాపరుద్రుఁడు క్రీ॥శ॥ 1296 న సింహాసనారూఢుఁడయ్యెను.

రాజ్యాంగసూత్రములఁ గేలఁబూనిన తరువాతఁ బ్రప్రథమమున నాతఁడు రాజధానియందు వసియించియుండు వివిధప్రజల ధనప్రాణరక్షణమునకై గట్టికట్టుదిట్టములఁ జేయనారంభించెను. ఆదినములలో నొక్కనాడు ఆకుల పురుషోత్తముఁడను పండితునింట దోఁపిడికాండ్రుపడి సంపదనంతయుఁ జూఱగొనుటయేకాక అతనిమర్దించి

గాయపఱచిరఁట. మహారాజున కవ్వార్త పిడుగువలెవిన వచ్చినందున సత్వరమే శౌర్యవిరాజితులగు డెబ్బదియేడ్గురు పద్మనాయకులనుఁ దనసేననుండిరప్పించి పట్టణపుఁ బ్రహారీపైననుండిన డెబ్బదియేడు బురుజులమీఁద నొక్కొక నాయకునిగను నాతనిక్రింద నలుగురు సరదారులను వారికి సహాయమొనర్చుటకు వలయు భటనికాయమును నేర్పఱచెను. ఈయేర్పాటులకొఱ కెంతయో ద్రవ్యము వ్యయమైనను దరువాతఁ బ్రజలధనాదులకెట్టి నష్టమును వాటిల్లక వారు నెమ్మదిగ జీవనములఁ గడుపుకొనుట సంభవించెను. మఱియుఁ బరిపాలితుల సుఖజీవనమునకు వలయు నితరకార్యముల నొనర్చి దిగ్విజయ యాత్రకై వెడలి కటకపురముపై దాడియొనర్చి యాతనిఁజయించి యమూల్యరత్నములఁ గానుకగాఁగొనెను. పిదప దక్షిణదేశోన్ముఖుఁడైచని రామేశ్వరము వఱకేగి మధ్యమార్గమున ననేకరాజులఁ బరాభూతులఁ జేసెననియు, వారలవలన ననర్ఘములగు నుపాయనములఁబడసి తులలేనిసంపదలతోను నసంఖ్యాకమగు జతురంగబలములతోను నిజరాజధానిఁ బ్రవేశించెననియుఁ జెప్పఁబడుచున్నది. ముకుందదేవి యను రాజ్ఞిదేశముపైనఁగూడ నీతనిసేనలు దండయాత్రనడపి విజయోపేతములుగ వెనుకకు మఱలెనని తెలియవచ్చుచున్నది; కాని యాయమ దేశమెచ్చటనుండెనో తెలిసికొన సాధనములెవ్వియు నగపడవు. ఇవిగాక ఘూర్జరదేశముపై నెత్తి యచ్చటిరాజును రణరంగమున నోడించెననియు, నాతనినుండి ప్రబలసైన్యముఁ గొనెననియుఁ గొన్ని గ్రంథములు చెప్పుచున్నను, నిదియెంతవరకు విశ్వాసార్హమో చారిత్రిక ప్రమాణములు లేనిది నిర్ణయింప వలనుపడదు. ఇవ్విధముగ నితఁడు గొప్పభూభాగమునుఁ దనకు లోఁబఱచుకొని యక్కాలమునందలి రాజులలో నసమానఖ్యాతినిఁ గడించియుండెను. ఎందఱో దేశాధీశులితనికి మాండలికులుగను చమూపతులుగను నుండినట్లు గ్రంథములును, శాసనములును సాక్ష్యమిచ్చుచున్నవి.

ఈతనికాలమున సామంతరాజుల పాలనముక్రింద నున్నదికాక, స్వీయపరిపాలనమునకు లోఁబడిన దేశము తూర్పున గోదావరీనదివఱకును, నుత్తరమున బీరారువఱకును, దక్షిణమున గృష్ణానదివఱకును వ్యాపించియుండినట్లగపడుచున్నది. వేఱుశబ్దములలో, నీభూభాగము మొత్తముమీఁద నిప్పుడు నిజామురాష్ట్రమెంతయున్నదో, యంతకుఁ దక్కువకాని వైశాల్యముఁ గలిగియుండినట్లు తోఁచెడిని. అనుదినకలహములచే స్వల్పవైశాల్యముగల రాష్ట్రములుతప్ప గొప్పరాజ్యముల నిర్మాణమున కవకాశములేని యక్కాలమున, నాంధ్రదేశరంగమందుఁ గాకతీయసామ్రాజ్యనాటకము సుమారు వేయివత్సరముల వరకు నవవిలాసములతోఁ బ్రదర్శింపఁబడియుండుట యొక సామాన్య కార్యము కాదు. కాకతిప్రభయుని నాఁటనుండి, తనపూర్వులార్జించిన రాజ్యమునుఁ దనబాహుపటిమచే విశాలతరముగనొనర్చి వంద్యముగఁ బాలనమునల్పిన ప్రతాపరుద్రుని కీర్తియెంతయు, గొనియాడఁదగియున్నది. ఇతనిరాజ్యపు వార్షికాదాయమును, సామంత భూపాలురవలనవచ్చు గప్పములునుఁగలసి యనేకకోట్ల రూప్యములుగ లెక్కింపఁబడినవి. ఈతనికాలమున ఓరుగల్లు పురవైభవము మేఱమీఱియుండెను. ఇప్పటి ఓరుగల్లుచుట్టును నాలుమైళ్ళదూరమును సుమారు 15 అడుగుల యున్నతియు, 14అడుగుల మందమును గలిగి, యావరించియున్న మట్టికోట మొదటిది. *సుమారు ముప్పదిమైళ్ళకొలతగల యీకోటగోడ, అచ్చటచ్చటఁ జెఱువుకట్టగ నుపయోగింపబడి, యాప్రదేశమందు నిలచుజలము వ్యవసాయముకొఱకు వాడఁబడుటకుఁ దగినవ్యవస్థ చేయఁబడియుండినట్లిప్పటికినిఁ గానవచ్చెడిని. ఈకోటకు నడుమనున్న స్థలమంతయు జనసమ్మర్దముగల యావాసములచేతనుఁ బేటలచేతనునిండియుండెడిది. అగ్నేయదిశన నీకోటద్వారము, హనుమకొండకిప్పుడు 9మైళ్ళదూరముననున్న గవిచర్లయను గ్రామసమీపమున నుండెననియు, నీగ్రామనామము గవిని (ద్వారము) చర్లయొక్క సంకుచితస్వరూపమనియు జెప్పెదరు. మట్టివాడయను పేరనిప్పుడు ప్రసిద్ధిఁజెందియున్నస్థల మక్కాలమున మట్టెలవాడ (మట్టెలమ్మవీధి)గ

* ఓరుగల్లుచుట్టు నేఁడుకోటలుండెనని జనులు వాడుకొనుచుందురు; కాని నిజముగ మూఁడుమాత్రమే కానవచ్చుచున్నవి. ఈమట్టికోట యొక్క యెత్తును మందమునుఁ బ్రతాపరుద్రుని కాలము నాఁడిప్పటికంటె నెన్నియోరెట్లు హెచ్చుగనుండెనని యూహింపబడుచున్నవి.

నుండెననియు వాడుకగలదు. ఇట్లే వేళ్ళుమాఱి పూర్వము నుండినిలచియున్న గ్రామము లిప్పుడీప్రాంతమున నెన్నియోకలవు. పైకోటకు లోపలిభాగమున నిప్పటి ఓరుగల్లు గ్రామము నావరించియున్న మట్టికోట సుమారు మైలున్నరపొడవును సంతియవెడల్పును, నష్టకోణాకారమును గలిగియున్నది. దానిలోపల రాతికోటయొకటి సుమారొక చదరపుమైలు వైశాల్యముఁ గలిగియున్నది. దీనిలోన మఱియొక మట్టికోటయుండెననిచెప్పి, ప్రాతయిటుకలతోడి కట్టడఁపుఁగుర్తుల నిప్పటికినిఁజూపెదరు. ఈరాతికోటలోపలనే రాజప్రాసాదములును, భవ్యదేవాలయములును నుండినట్లు తచ్ఛిథిలములు చాటుచున్నవి. ఓరుగల్లను నామము నీపురమునకొసంగిన యొక యొంటిరాతిగుట్ట, చిన్న దేవళముతోను, నుత్సవాదిసమయములందు రాజధిష్ఠించుటకై విచిత్రముగను నెత్తుగను నిర్మింపఁబడిన యున్నతవేదికతోను నొప్పుచుఁ, దానొకకాలమునఁ జూచియుండిన విభవాతిశయములనుఁ, గాకతీయసామ్రాజ్య మహామహిమమును నేఁడుసైతము చూపఱకు వాగ్రహితమగు భాషయందుపన్యసించుచున్నది. కాకతీయవంశపు రాజధాని హనుమకొండనుండి ఓరుగల్లునకు మార్పఁబడుటకెయ్యది కారణమయ్యెనని చరిత్రలు వాకొనుచున్నవో, యట్టి పరశవేది లింగముగల దేవాలయమని చెప్పఁబడు చిన్నగుడియొకటి సగము నేలలో నడఁగికానవచ్చుచున్నది. హృదయమున కానందమును, నాశ్చర్యమునుఁ గలిగించుచు, జక్కనిపనితనముచే బ్రకాశించుచుఁ గానవచ్చు నాల్గుశిలాద్వారములును రాజుగారిభవనమునకు సంబంధించియుండెనని చెప్పుచున్నారు. కోటలలో నిమిడియున్న ప్రదేశమంతయు నక్కాలమున నొకప్రబల సామ్రాజ్యలక్ష్మి కలంకారభూతములగు వివిధ వర్తకశాలలతోను, గర్మాగారములతోను నిండియుండెడిదఁట. చిత్రకార స్వర్ణకారులయొక్కయుఁ, బరిమళద్రవ్యవిక్రేతలయొక్కయు, శిల్పులయొక్కయు, నితరవృత్తులు గలవారియొక్కయు, గృహముల సంఖ్య సహస్రముల పరిమితికలిగియుండెను. సామాన్యముగ దేవాలయములయొక్కయు, ముఖ్యముగ శివాలయములయొక్కయు సంఖ్య, వందలకు మించియుండెను. ఇవిగాక నింకననేకజాతుల జనుల గృహములసంఖ్య ప్రతాపచరిత్రయందుఁ జూపబడియున్నది; దానిలో గొంత యతిశయోక్తి యుండుట కొప్పుకొనినను, నాయాజాతులకును, వృత్తులకును సంబంధించిన వారవ్వారమున నివసించి యుండిరనుటమాత్రము నిర్వివాదాంశము. ఒకప్పుడీమహారాజనుదినము భాగీరథీ పవిత్రజలములతోఁగాని మహేశ్వరుని బూజింపనను దీక్షఁబూని, కాశీక్షేత్రము నుండి ప్రతిదినమునీరందునట్లుచేయుటకై మూడువేలయిదువందల బ్రాహ్మణులనేర్పఱిచిమూడువత్సరములకాలము తనప్రతిన నిల్పుకొనినపిదప శివుడాతని మనోబలమును బరిక్షింపగోరి యేడుదినములవఱకునునిరంతమగు గాలివానను వృష్టించెననియు, గంగాతోయ[illegible]ందునఁ బ్రతాపరుద్రుడా యేడుదినము లుపవసించుట[illegible]డాతనిభక్తికి మెచ్చి యోరుగల్లునకుత్తరమున గ్రోసుదూరముపైన భాగీరథీఝరి యుద్భవిల్లునట్లనుగ్రహించెననియు నొకకథ కలదు. దీనిమూలమెట్టిదైననుఁ, గాశిబుగ్గయనుపేర నొకబావి ఓరుగల్లున కనతిదూరమున నున్నది. ఆషాఢమాసమున బర్వదినములందు జనులచ్చటికిఁబోయి, యందలిజలముల స్నానములొనర్చి గంగాస్నానఫలము లభించినదని సంతసించుటయు, మృతకులకు సద్గతిలభించుటకై వారియాస్థికలీయపరగంగాసలిలములందుఁ బడుటయు, నిప్పటికిని జరుగుచున్నది. ఈబావికడ మహారాజుగారుకట్టించినదని చెప్పఁబడు దేవళముసైతము శిథిలావస్థయందు నిలచియున్నది.

ప్రజాహితతత్పరత హిందూరాజులకుఁ జిరకాలమునుండి సహజభూషణమైవిలసిల్లినది. ఈనరపాలాగ్రణి పాలితుల సుఖముకొఱకును, సంపద్వృద్ధికొఱకును సహకారములగు దివ్యతటాకముల నేకములఁ గట్టించెను. 8000 గజములపొడవును, 6000 గజముల వెడల్పును, నిండియుండినప్పుడు 13 చదరపుమైళ్ళ జలోపరిభాగమునుఁగలిగి, కృష్ణానది కుపనదియగు మున్నేఅనుదానికి జన్మస్థానమును సముద్రోపమానమును నగు పాకాలచెఱువీ రాజశ్రేష్ఠుని కాలమున నిర్మింపబడినదేయని చెప్పుదురు; చరిత్రకారులు సైతమట్లేవ్రాసిరి. కాని యిటీవల నాతటాకపుఁగట్టపైనున్న శాసనమునుఁ బరిక్షించుటవలన నాయభిప్రాయము సరి

కాదనియు, నాచెఱువు గణపతిరాజుకాలమున నిర్మింపబడి యుండవలయుననియుఁ దెలియుచున్నది. పైశాసనములోని శ్లోకములరచించిన రామనాథకవి తన్నుఁ గాకతీయ గణపతిరాజు నాస్థానకవిగఁ జెప్పుకొనియున్నాఁడు. ఈవిషయమింకనువిచారణీయము. ప్రతాపరుద్రునికాలమునఁ గట్టబడిన దేవాలయములెన్నియో యిప్పటికిని జీర్ణావస్థయందు దమయేలిక యౌదార్యమునుఁ జాటుచున్నవి. ఈయన యెన్నియోమారులు తులాభారమునఁదూఁగి తనయెత్తు స్వర్ణమును బేదలకు బంచిపెట్టెను. గ్రహణకాలమందొకనాఁడు హాద్గల్యక్షేత్రమున 11 బంగారపుటావులను భూసురలకు దానమిచ్చెను. కృష్ణమాచార్యుండను పండితుని కోరికప్రకారమ [illegible] బంగారపువర్షముఁ గురిపించెనను కథ నీప్రాంతములందలి బాలురుసైత మెఱుంగుదురు! మానుకోటతాలూకాలోని మాటేడు గ్రామసమీపముననున్న యొకశాసనమునుబట్టి, శా. శ. 1232 (క్రీ. శ 1310)నకు సరియగు సాధారణసంవత్సర శ్రావణ బహుళాష్టమి సోమవారమునాఁడు ప్రతాపరుద్రుఁడచ్చటికేగి, యంతకుమున్నచ్చట కాకతిప్రళయుని సామంతుఁడగు మల్లనాయకునిచేఁ గట్టింపఁబడిన దేవాలయముం దర్శించి, శివదేవయ్య మొదలగువారనేక భూదానములొసంగినట్లగపడుచున్నది. వేయేల? శుష్కవచనములచే గాకఁ గ్రియాపూర్వకముగ నౌదార్యముఁ బ్రకటించుటయే యప్పటిరాజుల కీర్తిని చిరస్థాయిగాజేసిన ముఖ్య రహస్యము!

మొదటినుండి తుదవరకుయుద్ధప్రసంగములచేనిండియుండిన యీతని పరిపాలనకాలమున, విద్యావిషయములుఁగూడఁ గొంతశ్రద్ధనందియుండుట కన్పట్టుచున్నది. సంస్కృతవాఙ్మయమున కమూల్యాలంకారమై, ప్రతాపరుద్రీయమను నామాంకితమై, యొప్పు లక్షణగ్రంథమీ మహారాజు నాస్థానపండితుడగు విద్యానాథకవియొక్క విజ్ఞానఫలితమే. ఈజనపాలశేఖరుఁడు తానుప్రతాపమార్తాండమనుపేర నొకయుద్ధగ్రంథమును దేవభాషయందు రచించెను. విఖ్యాతకవియగు పాలకురికి సోమనాథుఁడు తనవిద్యామహిమచే దొంకిపర్తిమొదలగు నగ్రహారముల బడసెను. మారనకవికృతమగు మార్కండేయ పురాణమున కీమహారాజు సేనానియగు గన్నమంత్రియే కృతిభర్తయయ్యెను!

ఇంతకుఁబూర్వము రెండుమూఁడు శతాబ్దములనుండి హిందువుల స్వాతంత్ర్యమును మ్రింగివైచుచుండిన మహమ్మదీయుల దండయాత్ర లిదివఱకును దక్షిణమునకు వచ్చియుండలేదు. ఈరాజుకాలముననే క్రీ.శ.1308వ సంవత్సరమున డిల్లీచక్రవర్తియగు నల్లాఉద్దీన్ మలిక్ కాఫూరను వానిక్రింద నొకప్రచండసైన్యమునునిచ్చి, యాతని వంగదేశమార్గమున, నోరుగల్లుపై కనిపెను. మ్లేచ్ఛసైన్యము హనుమకొండ కాఱుమైళ్ళదూరమునందున్న రేచర్లనగరమువద్ద విడిసెననియుఁ, బ్రతాపరుద్రుని వాహినీవార మద్దానినెదుర్కొని పూర్తిగఁ బరాభవించి యంపెననియు, నీసంగ్రామమున మహారాజునకు నరపతిరాయఁడను శూరవరుఁడమిత సహాయమొనర్చెననియుఁ బ్రతాపచరిత్రకర్త వ్రాసియున్నాఁడు. చంద్రగిరియనుపేర నిప్పుడు వ్యవహరింపఁబడుచున్న యీరేచర్లనగర మక్కాలమున బ్రతాపరుద్రుని ప్రాంతాధీశులై త్రిభువనగిరిరాజు కొండసింగపురము మొదలగు స్థలములఁ బాలించుచుండిన వెలమ వంశజుల ముఖ్యస్థానమై యుండినట్లు అయ్యనప్రోలు శాసనమువలనఁ దెలియుచున్నది. ఈయుద్ధమున మహమ్మదీయసేనలు పరాజయమునొందుట యగపడుచుండినను, మహమ్మదీయ చరిత్రకారులు పోరుజఱుగకపూర్వమే చక్రవర్తికార్యాంతరమునఁ దనసేనల డిల్లీకిఁ బిలుపించుకొనెనను నసత్యపువ్రాతల వ్రాసియున్నారు.

రెండవమాఱే కాఫూరు క్రీ॥శ॥ 1309 సంవత్సరమున డిల్లీనుండి వెడలి దేవగిరి మార్గమునఁ ద్రిలింగరాజ్యముం బ్రవేశించి (ఇప్పటి నిజామాబాదు)వచ్చి తత్సమీపముననుండిన సార్బార్ కోటను హస్తగతముచేసికొని యపరిమిత రక్తపాతమొనర్చెను. అటనుండి యాతఁడు ఓరుగల్లుపైనెత్తిరాగా ప్రతాపరుద్రుని సైన్యములాతనితో డీకొని ధైర్యముగఁ బోరుసల్పెను. కాని దేశద్రోహియైన కటకరాజు తురుష్కులకు సహాయము చేసినందువలనను, మాతృద్రోహులగు కోటలోనికొందరు నాయకులు

ధనాశచేఁ దురుష్కులకు ననుకూలురైనందునను అదివరకు బాధఁజెంది యున్న జైనులు రాజ్యములోనిగుట్టును శత్రువులకుఁ జెప్పినందువలనను' దుదకు హిందూసైన్యములకుఁ బరాభవము వాటిల్లుటచేతఁ ‘బ్రతాపరుద్రుఁడు ఢిల్లీశ్వరునకుఁ గప్పముకట్టునట్లు సంధిచేసికొనవలసిన వాఁడాయెను.’ హనుమకొండయందుఁ గాకతిరుద్రదేవుని కాలమున నిర్మింపఁబడి నేటికిని పురాతన శిల్పిచాతుర్యమునకొక యుత్కృష్టోదాహరణముగ నిలచియున్న వేయిస్తంభముల దేవాలయమును భిన్నభిన్నముగ నొనర్చిన గౌరవము కాఫూరుయొక్కయు నాతనిసేనలయొక్కయు నీతూరిదౌర్జన్యదుర్ణయముల కేచెందుచున్నదని చెప్పుదురు.

తరువాతఁ గొలదికాలమునకే ఢిల్లీసార్వభౌమత్వముఖిల్జీ వంశమునుండి తుగలుఖు వంశమునకు మారెను. ఓరుగంటిరాజు దక్షిణహిందూదేశరాజులతోఁ గూడి యీమధ్యకాలముననే ఢిల్లీసింహాసనమునకుఁ గప్పముఁ గట్టుట మానినందున నప్పటి చక్రవర్తియగు గయాసుద్దీనుని పుత్రుఁడును దనమందబుద్ధియొక్క యతిశయముచేత హిందూదేశ చరిత్రయందొక క్రొత్తయధ్యాయముఁ గల్పించినవాఁడునునగు ఉల్లూఖానుఁడొక గొప్పసేనను వెంటఁగొని మలిక్ తైమూర్, మలిక్ అఫ్గాన్, మలిక్ తగీన్ మున్నగు సేనాధీశులతోఁ గూడి క్రీ॥శ॥ 1321 సంవత్సరమున నోరుగంటికోటను ముట్టడించెను. ప్రతాపరుద్రుఁడు స్వయముగ నాసేనలతో మిగులశౌర్యమునఁ బోరాడి యంతకుముందు దనకంటియుండిన పరాజయకళంకమునుఁ బూర్తిగఁ గడిగివైచికొనెను. ఆంధ్రసేనలా ఘోరసంగ్రామమునఁ బ్రాణముల నరకుసేయక పోరి తామొక్కకాలమున మగధరాజ్యమువంటి ప్రబలరాష్ట్రమును జయించినవారి సంతతులమనిచూపిరి. ఆంధ్రుల ప్రతాపమునెదుట నిలువఁజాలక మ్లేచ్ఛసైన్యములు చెల్లాచెదరు కాసాగెను. మ్లేచ్ఛసేనాధీశులు యువరాజుతోఁబాటు పిక్కబలిమిఁజూపిరి. ప్రతాపరుద్రునిసేనలు మ్లేచ్ఛసైన్యములవెంటనంటి మలిక్ తైమూరునుబట్టి వధించి మిట్టిపడుచుండిన ప్రతిపక్షులకు బుద్ధిసెప్పిరి. మలక్ అఫ్గానువలాయననూత్రమునుఁ బతించుచుండ నంతకుముందీ మహమ్మదీయులవలన స్వాతంత్ర్యమునుఁ గోల్పోయియుండిన మహారాష్ట్రులాతనిఁ బట్టుకొని చర్మమొలిపించి చిత్రవధగావించి క్రీ॥శ॥ 1318 వయందు దేశస్వాతంత్ర్యమునకై యత్నించుచు మ్లేచ్ఛులవలనఁ జంపఁబడిన హరపాలదేవుని హత్యకుఁ బ్రతీకారమొనర్చిరి!

కాకతీయ సామ్రాజ్యవనమిట్టి మహోన్నతపదవియందుండ నందు బ్రతికూలవాయువులు వీవసాగెను. అంతఃకలహములు క్రమముగవృద్ధియై రాజ్యఁపుఁబలమునుఁ దగ్గింపఁ దొడఁగె. గణపతిరాజుయొక్కయు తరువాతి ప్రభువులయొక్కయు శైవమతావేశమునకు గుఱియైయుండిన జైనుల ప్రతీకారాసక్తి నాఁటి నాటికిఁబెరిగి సామ్రాజ్యవినాశనమునకు సాధనములఁగూర్చుచు మహమ్మదీయులనాకర్షింపసాగెను. అట్లుకాదేని యంతకు వెనుకటివత్సరముననే బ్రతుకుజీవుఁడాయని కాళులకుఁ బుద్ధిసెప్పియుండిన తురుష్కులకు మఱల క్రీ॥శ॥ 1323 వ సంవత్సరమున నోరుగంటిని ముట్టడించునంతటి ధైర్యమెటనుండి రాగల్గును? ఉల్లూఖానుఁడు మరల నొకసైన్యముఁగొని త్రిలింగరాజ్యములోనిదగు బీదరుమార్గమున నోరుగల్లుఁబ్రవేశించి ప్రతాపరుద్రునోడించి ఢిల్లీకి జెఱగొనిపోయెను. ఖాజాహాజీ, మలిక్ ఖేధార్ ఖానులను సేనానుల నాతనివెంటనంపి ఓరుగల్లుకు సుల్తానుపురమనా పేరుబెట్టి ఉల్లూఖానుఁడు తానునుకొన్ని దినములకు ఢిల్లీకిఁబోయెను.

శాత్రవసేనాటవియందు స్వైరవిహారము సల్పిన యీరాజసింహము కాలవశమున ఢిల్లీలోఁ గొన్నినాళులు చెఱయందుండెను. అప్పుడు ఢిల్లీని పాలించుచుండిన చక్రవర్తియగు గయాసుద్దీనుయొక్క సౌజన్యమును నాతనితల్లియొక్క సద్బోధయు మనకథానాయకుని కారాగారవిముక్తికిఁ గారణములయ్యెను. ఆచక్రవర్తి యుచితమర్యాదలతోఁ బ్రతాపరుద్రుని స్వరాజ్యమునకంపెను. స్వదేశోన్ముఖుఁడై త్రిలింగదేశమున కొకదిశనహద్దగు కాళేశ్వరమునకాతఁడువచ్చెను. అంతకుమున్ను శత్రువులచే నొందిన పరాభవమును నెడతెగని యుద్ధప్రసంగములును నాతనిమనస్సును స్తబ్ధముగఁజేసెను. మిగిలిన జీవితభాగమును బ్రాపంచిక సుఖాభిరతిచేఁ గళంకితముకానీక

గౌతమీసలిలములచేఁ దనశరీరమును ఈశ్వరసేవార్చనలచేఁ దనయాత్మనుఁ బవిత్రముగఁ జేసికొనఁ గృతనిశ్చయుఁడై యతఁడు రాజ్యాంగవ్యవహారముల సోదరుఁడగు నన్నమదేవునకునుఁ గుమారుఁడగు కృష్ణదేవునకును నప్పగించి తాను పత్నీయుతముగ నచ్చటనేనసియించి క్రీ॥శ॥ 1328 సంవత్సరమున రుధిరోద్గారి సంవత్సర మాఘశుద్ధాష్టమీ గురువారమునాఁడు శివసాయుజ్యమునందెను. ఆయన భార్యయు సహగమనవిధిచే భర్తననుగమించెనని చెప్పఁబడుచున్నది.

ప్రతాపరుద్రుని మరణముతోఁ గాకతీయవంశవైభవము నిశాంతదీపికయయ్యెను. ప్రాంతాధీశులును సామంతులును స్వతంత్రులైరి. ఓరుగంటిరాజ్యమున మ్లేచ్ఛుల ప్రాముఖ్యత హెచ్చసాగెను. అట్లనుటవలన నీవంశమంతటితో నశించెనని తలపఁరాదు. కృష్ణదేవుఁడు తండ్రిపదవి నధిష్ఠించినతరువాత క్రీ॥శ॥ 1344 నఁ గాకతీయవైభవదీపిక కోలానునందుజఱిగిన యుద్ధరూపమున విజయనగరరాజ్య సహాయమునఁ దుదిమారు భగ్గునమండి సేనాధిపతియు యువరాజుననగు వినాయకదేవుని వీరశయనముతోఁ గొండయెక్కె. వేయిసంవత్సరములనుండి శత్రురాజులకన్నుల మిఱుమిట్లుగొల్పుచుండిన రాజ్యమందిరము నంధకారబంధురముగ నొనర్చెను. ఓరుగంటి యువరాజు దేశరక్షణోద్యమమున నసువులఁబాసి షేక్స్పియరుయొక్క యీక్రిందివచనముల ననుసరించెను.

చ. నడుపుము ధర్మమార్గమున నమ్మికతోఁ; భయమొందబోకు మె
న్నడును; తలంపులన్నియును, న్యాయమునందు,స్వదేశమందు,నె
క్కుడు భగవంతునందెపుడుఁ గూరిమినిల్పు; మటుల్ప్రవర్తనఁ
బడితివయే నిధన్యుడవు; భాగ్యమిదే! కనుమత్యుక్రౌముజెల్॥

# వాసిరెడ్డి సంస్థానము.

గుంటూరు డిప్యూటీతహశ్శీలుదారగు చిరుమామిళ్ల లక్ష్మీ నారాయణప్రసాద్ బి. ఏ., గారిచే వ్రాయఁబడినది.

వాశిరెడ్డిసంస్థానము చెన్నరాజధానియం దుత్తర సర్కారులలో నెన్నదగు సంస్థానములలో నొకటి. ఈసంస్థానీకులు కమ్మవారు, షుమారు ఎనిమిదివందల సంవత్సరములకు పూర్వము దక్షిణహిందూస్థానమున 'వాసి' యనునామముతో నొకవంశము ప్రభుత్వముజేయుచుండెను. వారిప్రభుత్వస్థానమున కనతిదూరములో బహుయోజనవిస్తీర్ణంబగు నొక యరణ్యంబుండెను. అందునచ్చటచ్చట ఫలపుష్ప సమన్వితంబులగు వృక్షరాజములతో చుట్టుకొనబడి స్వభావసిద్ధమగు నందమును వెలిబుచ్చుచుండెడు గ్రామములుకలవు. ఏతదరణ్యంబునకు నాధుండులేని కతంబున 'వాసి' వంశీకులు, అందుముఖ్యగ్రామములగు, వల్లుట్ల, వాసివి,కలకట్టలను బాహుపరాక్రమము నెఱపి స్వాధీనపర్చుకునియు, మఱికొన్నిగ్రామముల క్రొత్తగ నేర్పఱిచి వృద్ధిచేసియు తమరాజ్యమును బలపఱచుకొనిరి. పదపడి సామీప్య సంస్థానాధీశులగు రెడ్లతో వీరు చెలిమివాటించి ప్రజాతృప్తికరముగ రాజ్యపాలన చేయుచుండిరి. ఇట్టిస్థితియందు రెడ్లప్రభుత్వమునకు లోబడినవారు కప్పమునుచెల్లించక ప్రభువులయెడ తిరస్కారభావంబును జూపింప ప్రజానాశనకరంబు గాకుండుటకునై యోచించి యుభయపక్షులవారును తులారణంబు నేర్పాటుగావించుకొనిరి. కాని రెడ్లప్రభువగు జౌడభూపతికి తనసైన్యంబున దులారణంబునకు తగినవీరుండు కానరాడయ్యె. 'వాసి' వంశంబున సదాశివయ్య యనునాతడు ప్రతిలేనివీరుండై బాహుపరాక్రమంబున యర్జునున కన్నమిన్నయై వెలయుచుండు కతన దనకుదానై మిత్రునకు దోడ్పాటుగానెంచి జౌఢభూపతిపక్షమున తానుతులారణంబున కేగనిశ్చ